బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం-13, అక్టోబర్ - 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి



మిగతా 2లో..

విజయవాడ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



వివరాలు 2లో..

బ్రేకింగ్.. ఆరు రాష్ట్రాలకు
కొత్త గవర్నర్లు..!



హైదరాబాద్, అక్టోబర్ 12:
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త గవర్నర్ల ను నియమించారు. ఉత్తరాది, దక్షిణాది కలిపి ఆరు రాష్ట్రాలకు నూతన ప్రథమ పౌరులను ముర్ము కేటాయించారు. కేరళం ప్రథమ పౌరుడిగా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు పూర్తి స్థాయి గవర్నర్‌గా నియమితులవ్వగా.. సిక్కింలో సేవలందించిన ఓమ్ ప్రకాశ్ ముథుర్ కేరళం నూతన గవర్నర్‌గా వ్యవహరించనున్నారు. ఒడిశాకు బ్రజ్ మోహన్ రామ్, కర్నాటకకు సుధా యాదవ్, ఉత్తారాఖండ్‌కు ధాల్ సింగ్ బైసెన్, సిక్కింకు దుష్యంత గౌతమ్ గవర్నర్‌లుగా ఎంపికయ్యారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ప్రతిపక్షాల నిరసనలతో ఢిల్లీ అట్టుడుకుతున్న వేళ కొత్త గవర్నర్లను నియమించారు రాష్ట్రపతి. మిగతా 3లో..

రైతులు అల్లాడుతుంటే సీఎం ఢిల్లీ పర్యటనలా?

- సాగునీరు, విద్యుత్ లేక ఎండుతున్న పంటలు.. పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎల్‌నినో హెచ్చరికలు వచ్చినా ముందస్తు చర్యలు శూన్యం
- జూరాల నీళ్లు తీసుకున్న రైతులపై కేసులు.. బీర్ల ఉత్పత్తికి నీళ్లెందుకు?
- ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 12: రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతూ రైతులు సబ్‌స్టేషన్లు, రహదారులపై ఆందోళనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాష్ట్ర సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.ఎల్‌నినో ప్రభావంతో కరువు మిగతా 3లో..

గురుకుల కుంభకోణ సూత్రధారి రేవంత్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన ఆరోపణ



హైదరాబాద్, అక్టోబర్ 12: రాష్ట్రం లోని గురుకులాల్లో భారీ అవినీతికి సీఎం రేవంత్‌రెడ్డే ప్రధాన సూత్ర ధారి అని, అలాంటిది ఆయనకే ఫిర్యాదు చేయాలనడం హాస్యా స్పదమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమ వారం సామా జిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రవేశ పెట్టే ప్రతి పథకం వెనుక ఒక భారీ కుంభకోణం దాగి ఉం టుం దని ఆరోపించారు. నిజాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నా రని, గురుకు లాల్లో అక్రమాలపై గతంలోనే బీఆర్ఎస్ అన్ని ఆధా రాలను బయటపెట్టి బహిరంగ చర్చకు సవాలు విసిరినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆయన గుర్తుచేశారు. పసిపిల్లల భవిష్యత్తును తాకట్టు పెడుతూ కేరళ ఎన్నికల ఖర్చుల కోసమే పీఎం యూ జీవో 17 తీసుకొచ్చారని ఆరోపించారు. సచివాలయంలో చక్రం తిప్పుతున్న దుష్టచతుష్టయం వెనుక ఉన్న అసలు శక్తులను త్వరలోనే పూర్తి ఆధారాలతో బయటపెడుతామని స్పష్టంచేశారు.

శాంతియుత నిరసనకారులను నిర్బంధించొద్దు



- మెట్రో, రైలు సేవలు యథావిధిగా నడపాలి
- ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించొద్దు
- ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలి
- ప్రజాశాంతిని కాపాడే పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను పూర్తిగా నిరోధించలేం
- ఢిల్లీ నిరసనలపై సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు

వివరాలు 4లో..

రేవంత్ తీరుతో తెలంగాణకు తీవ్ర నష్టం

- ముఖ్యమంత్రి అవినీతిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సంచలన ఆరోపణలు
- ఆంధ్రా కంపెనీలకు ప్రజల సొమ్ము దోచిపెడ్తున్నడు
- తక్కువ కోట్ టెండర్లు కాదని, ఎక్కువపై మక్కువ
- రాష్ట్రం కోసం అప్పులు తెచ్చి ఇట్లా దోచుకుంటరా?
- సింగరేణిని ఇట్లనే అవినీతిలో ముంచుతున్నరు
- ఈ దోపిడీపై రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేస్తా..
- రేడియల్ రోడ్లపై వదిలిపెట్ట! సుప్రీంకోర్టుకూ వెళ్తా



హైదరాబాద్, అక్టోబర్ 12: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్న శాఖలోనే రేడియల్ రోడ్లది అతి పెద్ద కుంభ కోణం. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఎండీఏ, హైదరా బాద్ గ్రోత్ కారిడార్.. అన్నీ సీఎం శాఖకు సంబంధిం చినవే. సీఎం శాఖల పరిధిలోని జీహెచ్ఎంసీలోనే రూ.వేల కోట్లు దోపిడీ చేస్తే ఎలా? దొరికింది దొరికినట్టు దోచేస్తున్నరు. సీఎం రేవంత్ తీరు తెలంగాణ ప్రజలకు చాలా నష్టం..' అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమ టిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన ఓ యూట్యూబ్ చానల్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం మొదలు అన్ని స్థాయిల నేతలపై వస్తున్న అవినీతి ఆరోపణలకు మిగతా 3లో..

సరిహద్దు రేఖ వద్ద
పేలిన ఐఈడీ..



- లష్కరే తొయిబా కీలక నేత సహా నలుగురు హతం..!

హైదరాబాద్, అక్టోబర్ 12: భారత్‌లోకి చొరబడేందుకు ప్రయ త్నించిన లష్కరే తొయిబా కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈసా రి ఆ ఉగ్రముఠా కీలక నేతల్లో ఒకరు మృత్యువును తప్పించుకోలే కపోయాడు. జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు రేఖ (ఎల్ఓసీ) గుండా దేశంలో అడుగుపెట్టాలనుకున్న ఈ ముష్కర మూకలోని నలు గురు ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజిక్ డివైజ్ (ఐఈడీ) పేలుడులో హతమ య్యారు. సోమవారం సంభవించిన ఈ పేలుడులో లష్కరే ప్రధాన నాయకుడు మొహమ్మద్ ఫైజాన్ సహా నలుగురు మరణించారు. ఎల్ఓసీ దరిదాపుల్లో చొరబాట్లను మిగతా 3లో..

సర్వే రిపోర్ట్‌కు 20 లక్షలు



- ఏసీబీకి చిక్కిన అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వేయర్, తహసీల్దార్

హైదరాబాద్, అక్టోబర్ 12: ఏసీబీ వలలో రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు పట్టుబడ్డారు. రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రూ.20 లక్షలు లంచం తీసుకుంటూ తహ సీల్దార్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్ పట్టుబడ్డ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేసేందుకు సర్వేయర్ ఈ లంచం డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో సర్వే యర్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం తహసీ ల్దార్‌ను కూడా నిందితునిగా అరెస్ట్ చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం



- సర్కార్ పగ రైతు ఆత్మహత్యాయత్నం
- హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణ
- మూడెకరాలు ఇచ్చేందుకు రైతు వెంకటయ్య నిరాకరణ
- పొలానికి విద్యుత్తు కనెక్షన్ కట్ చేసిన అధికారులు
- తీవ్రంగా నష్టపోయిన కుటుంబం
- అధికారుల ముందే పురుగుల మందు తాగిన రైతు
- వికారాబాద్ జిల్లా దవాఖానలో కొనసాగుతున్న చికిత్స
- బాధితుడిని పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి, పట్నం

వివరాలు 2లో..

దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు

- ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం
- ముఖ్య అతిథిగా ప్రశాంత్‌రెడ్డి
- మెరిసిన సిరిసిల్ల నేతన్న



హైదరాబాద్, అక్టోబర్ 12: ఎమిరేట్స్ తెలంగాణ కల్చ రల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్(ఈటీసీఏ) ఆధ్వర్యంలో దుబాయ్‌లోని షబాబ్ అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో 16వ బతుకమ్మ సంబురాలు అదివారం రాత్రి ఘనంగా జరి గాయి. ఈ వేడుకలకు బాలొండ ఎమ్మెల్యే వేముల ప్రశాం త్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సంబురాలకు దుబాయ్ నలుమూలల నుంచి 6,000 మందికిపైగా తెలంగాణ ప్రవాసులు తరలివచ్చారు. ప్రాంగణమంతా అచ్చ తెలంగాణ పల్లె వాతావరణాన్ని తలపించింది. కేసీఆర్ పాటలకు బీఆర్ఎస్ నాయకులు ఉత్సాహంగా నృత్యం చేయగా, పలువురు మహిళలు కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, దుబాయ్ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇమ్మడి విష్ణువర్ధన్‌రెడ్డి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మిగతా 3లో..

ఆశలు కూల్చిన 'ఇందిరమ్మ'!

- ఇల్లిస్తామనడంతో ఇల్లు కూల్చివేత
- కూతురి కిరాయి ఇంటికి తల్లి
- ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూసి తుదకు కన్నుమూసిన పేదరాలు
- ఇంటి ముందు మృతదేహాన్ని అనుమతించిన యాజమాని
- చేసేదేమీ లేక కూల్చిన స్థలంలోనే ఉంచి అంతిమ సంస్కారాలు
- ఖాళీ స్థలంలో నివాసం ఉండేదెలా అంటూ కూతుళ్ల ఆవేదన

వివరాలు 3లో..

ప్రయాణికుల రద్దీకి అదనపు బస్సులు : ఎండీ



హైదరాబాద్, అక్టోబర్ 12: దసరా పండుగను పురసరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు చేసినట్టు ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. సోమవారం అధికారులతో జూమ్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడిపి కోటి నలభై లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చామని తెలిపారు. గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ.13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది మహిళలు రోజుకు రూ.13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలిగామని వివరించారు.ఈనెల 15,16,17 తేదీల్లో రద్దీకి మిగతా 3లో..

14న జస్టిస్ వినోద్‌కుమార్ ప్రమాణం



హైదరాబాద్, అక్టోబర్ 12: మద్రాస్ హైకో ర్టు నుంచి బదిలీపై వస్తున్న జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్ ఈనెల 14న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.నిరుడు జూలైలో తెలంగాణ నుంచి బదిలీపై మద్రాస్ హైకోర్టుకు వెళ్లిన జస్టిస్ వినోద్‌కుమార్‌ను తిరిగి సొంత రాష్ట్రానికే బదిలీ చేయాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులను కేంద్రం ఇప్పటికే ఆమోదించి ఉత్తర్వులు జారీచేసింది.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

బెజవాడ దుర్గమ్మను దర్శించుకోనున్న తమిళనాడు సీఎం విజయ్



విజయవాడ, అక్టోబర్12: నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ వారిని తమిళనాడు ముఖ్య మంత్రి జోసఫ్ విజయ్ దర్శించుకోనున్నారు. మంగళవారం (13-10-2026) సాయంత్రం 4.30 గంట లకి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి సోమవారం ఇంద్రకీలాద్రికి సీఎం భద్రతా సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ రూట్ మ్యాప్‌ను వారు పరిశీలించారు. మరో వైపు ఏపీలో సీఎం విజయ్ పర్యటన షెడ్యూల్‌ను తమిళనాడు సీఎం కార్యాలయం విడుదల చేసింది.ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు రావాలంటూ తమిళనాడు సీఎం జోసఫ్ విజయ్‌ను ఏపీ టీడీపీ ఎంపీలు స్వయంగా కలిసి ఆహ్వానించారు. ఇటీవల చెన్నైలో సీఎం విజయ్‌ను ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జీఎం హరీశ్ బాలయోగి కలిసిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ పోలీసుల ఉత్తర్వుపై దీప్కే రియాక్షన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించి దానికి బదులుగా మూడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ప్రవేశపెట్టాలన్న ఢిల్లీ పోలీసుల నిర్ణయం నేపథ్యంలో యావద్దేశం జంతర్ మంతర్‌గా మారిపోతుంది అంటూ సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే హెచ్చరించారు. ప్రజాస్వామిక నిరసనలను ప్రభుత్వం అణచివేస్తున్నదని, అసమ్మతిని తెలిపే హక్కును లక్ష్యంగా చేసుకుంటున్నదని ఆయన ఆరోపించారు. వారు(ఢిల్లీ పోలీసులు) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన ప్రదేశం కాదు. ఏదేమైనా ఆ పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇప్పుడు యావద్దేశం జంతర్ మంతర్‌గా మారిపోతుంది అని ఎక్స్ వేదికగా దీప్కే పేర్కొన్నారు.

రైతు డిస్కమ్‌కు రూ.46,126 కోట్ల అప్పులు

నెట్‌వర్, సిబ్బంది, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల బదిలీ



హైదరాబాద్, అక్టోబర్ 12: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన రైతు డిస్కమ్‌కు రేవంత్‌రెడ్డి సర్కార్ భారీ గుదిబండ తగిలించింది. ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లకు ఉన్న రూ.62,037 కోట్ల అప్పుల్లో రూ.46,126 కోట్ల అప్పులను రైతు డిస్కమ్ ఖాతాలో వేసింది. రైతు డిస్కమ్ ఏర్పాటు నేపథ్యంలో ఆస్తుల, అప్పులు, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు, ఉద్యోగుల బదిలీని సర్కార్ పూర్తిచేసింది. ఈ మేరకు ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్ సోమవారం జీవో 17 జారీచేశారు. దీంతో ఉత్తర డిస్కమ్‌కు రూ.6 వేల కోట్లు, దక్షిణ డిస్కమ్‌కు రూ.17 వేల కోట్లకుపైగా అప్పులు మిగిలాయి.ఆర్వీడీసీఎల్‌కు 30,62,853 విద్యుత్తు కనెక్షన్లు బదిలీ చేయడంతోపాటు 27,717 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించారు. వీటి బుక్ వ్యాల్యూ రూ.2,123.46 కోట్లు ఉంటుందని 5,800 మెగావాట్ల విద్యుత్తు కొనుగోళ్లకు టెండర్లు రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరగడంతో 5,800 మెగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ కొనుగోళ్లకు టీజీ రెడ్‌కో టెండర్లు ఆహ్వానించింది. ఇందులో 2 వేల మెగావాట్ల సోలార్ (రౌండ్ ది క్లాక్), 3 వేల మెగావాట్లు సోలార్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు కొనుగోలుకు టెండర్లు పిలిచింది. టారిఫ్ అధారిత కాంపిటేటివ్ బిడ్డింగ్ పద్ధతిలో డెవలపర్లను ఎంపిక చేయనున్నది.

రైతు ఆత్మహత్యాయత్నం

అధికారుల ముందే పురుగుల మందు తాగిన రైతు

వికారాబాద్ జిల్లా దవాఖానలో కొనసాగుతున్న చికిత్స

బాధితుడిని పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి, పట్నం



హైదరాబాద్, అక్టోబర్ 12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో రైతుల నుంచి భూములను బలవంతంగా గుంజుకునే చర్యలు ఆగడం లేదు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములు ఇవ్వబోమని చెప్తున్నవారి నుంచి నయానో, భయానో సేకరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. తాజాగా అధికారులు ఓ రైతు పొలాన్ని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేయగా, ఆయన ఒప్పుకోలేదు. దీంతో విద్యుత్తు కనెక్షన్ కట్‌చేయగా, పొలం ఎండిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన ఆ రైతు, అధికారుల ముందే పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రస్తుతం ఆ రైతు వికారాబాద్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు గడుస్తున్నా బయటికి రాకుండా బిగ్ షాడో మేనేజ్ చేసినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోమవారం వికారాబాద్ జిల్లా దవాఖానకు వెళ్లి, బాధిత రైతును పరామర్శించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామానికి చెందిన డీ వెంకటయ్యకు సర్వేనంబర్ 144/ఆ, 144/ఇ లో మూడు ఎకరాల 12 గుంటల భూమి ఉన్నది. ఈ పొలం లగచర్ల గ్రామ శివారులో ఉంటుంది. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు భూ సేకరణ చేపట్టడంతో, వెంకటయ్య తన భూమిని ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తన పొలంలో వరితోపాటు కందులు సాగు చేశారు. తాము భూ సేకరణకు ఒప్పుకోకపోవడంతో అధికారులు తమ పొలానికి ఉన్న విద్యుత్తు కనెక్షన్లను తొలగించారని బాధిత కుటుంబం తెలిపింది. దీంతో పంట మొత్తం ఎండిపోయిందని పేర్కొన్నది.రైతు వెంకటయ్య ఆదివారం ఉదయం పొలానికి వెళ్లగా అక్కడ దుద్యాల తహసిల్దార్, ఇతర అధికారులు కనిపించారు. రైతు వారిని నిలదీయగా.. 'నీ పొలాన్ని సర్కార్ తీసుకుంటుంది. మొత్తం చదును చేస్తాం. పంటకు పరిహారం ఇస్తాం' అని బెదిరించారని రైతు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో వెంకటయ్య తీవ్ర మనస్తాపం చెంది, అక్కడే పొలంలో ఉన్న క్రిమిసంహారక మందు తీసుకొని, ఆఫీసర్ల ముందే తాగాడు. ఒక్కసారిగా షాక్‌కు గురైన అధికారులు, అక్కడి నుంచి జారుకున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని హుటాహుటిన ఆటోలో కోస్గి దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, పరిస్థితి విషమించడంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

సీపీ పోలీస్ కమిషనర్



పెద్దపల్లి, అక్టోబర్ 12: : బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే బ్యాం కులు ఏటీఎం ల వద్ద జరిగే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు,వివిధ బ్యాంకుల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బ్యాంకులు, ఏటీఎంల భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆర్థిక నేరాల నివారణపై చర్చించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు,79 ఏటీఎం కేంద్రాలు, మంచిర్యాల జోన్‌లో 109 బ్యాంకులు,89 ఏటీఎం కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ప్రతి ఏటీఎం కేంద్రంలో 24 గంటలూ సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు.దోపిడీ లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది ఎలా స్పందించాలనే అంశంపై బ్యాంకు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. డీవీఆర్‌లను బహిరంగంగా కనిపించకుండా సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఏటీఎంలలో నగదు నింపే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలి తెలిపారు.ఏదైనా అనుమా నాస్పద లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, వివిధ బ్యాంకుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నార్లపూర్ పంపు ఆన్ చేయకపోతే కార్యాచరణకు సిద్ధం

సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 12: నార్లపూర్ రిజర్వాయర్ , పంపు హౌస్ సిద్ధంగా ఉన్నా నాయకుల నిర్లక్ష్య ధోరణితో నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులకు వేలాది కోట్ల పంట నష్టం జరుగుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగ మైన నార్లపూర్ రిజర్వాయర్‌ను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలసి సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 24గంటల కరెంట్ ఇస్తే పంపులు ప్రారంభిస్తా మని అధికారులు నివేదికలు ఇచ్చినా, జిల్లా మంత్రులు పెడచెవిన పెట్టి రైతులను ఆగం చేస్తున్నారని ధ్వజం ఎత్తారు.మంత్రి కృష్ణా రావు బీర్ల కంపెనీకి నీళ్లు ఇవ్వాలని అంటారు. కానీ రైతుల గురించి పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.ఒకటి రెండు రోజులలో నార్లపూర్ పంపు ఆన్ చేయకపోతే కార్యాచరణకు పూనుకొని రైతులకు అండగా నిలుస్తామని హెచ్చరించారు.కేసీఆర్ హయాంలో నార్లపూర్ రిజర్వాయర్ పంపు హౌస్ సిద్ధం చేసి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 మోటార్లు సిద్ధం చేసి , ఒక పంపు ఆన్ చేసి రిజర్వాయర్ నుంచి నీళ్లు ట్రయల్ రన్ ద్వారా విడుదల చేశారని ఆరోపించారు.శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల ద్వారా224 టీఎంసీలు, నల్లమల ద్వారా వచ్చే నీళ్లతో పాటు మొత్తం 244 టీఎంసీ నీళ్లు వచ్చి చేరాయని వెల్లడించారు. ఇందులో 50 టీఎంసీలు విద్యుత్తు ఉత్పత్తికి సరిపోగా, మిగతా 180 టీఎంసీల నీళ్లు వాడుకోకుండా ఆంధ్రాకు ధారాదత్తం చేశారని మండిపడ్డారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 5 పంపుల్లో ఒక్క పంపు మంచి నీటికి నడిచినా, మిగతా రెండు పంపులు ఎందుకు నడుపలేరో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డితో జిల్లాకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. మంత్రులకు బీర్ల కంపెనీకి నీళ్లు ఇచ్చే ద్యాస తప్పా రైతుల పట్ల సోయి లేదని నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఇప్పటికైనా కల్వకుర్తి 3 పంపులు 24గంటలు నిర్విరా మంగా నడపాలని, నార్లపూర్ ఒక పంపు నడిపి రైతులను ఆదుకోవాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి



హైదరాబాద్, అక్టోబర్ 12: మహిళలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధిం చడంతోపాటు, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు.జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, చంపాపేట డివిజన్ యువ నాయకురాలు సంధ్య రవి ముదిరాజ్ అధ్యక్షతన స్థానిక మోడల్ మార్కెట్ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక మహిళ నైపుణ్యం సాధిస్తే ఆ కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం కూడా ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రు లుగా ఎదగాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతోపాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధికి ఉపయోగపడే కోర్సుల్లోనూ శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, తద్వా రా తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబ నకు ప్రాధాన్యమిస్తూ జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రమాదేవి, ఉష, ప్యారి, కవిత, లావణ్య, స్వయం ప్రభు, ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విజయవాడ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురి సజీవ దహనం



విజయవాడ, అక్టోబర్ 12: నగరంలో ఘోర ప్రమాదం జరి గింది. స్థానిక బైపాస్ రోడ్డులో కారు రెయి లింగ్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి.. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమా చారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు.ఈ ప్రమా దంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు గుంటూరు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న వాసులని పోలీసులు వివరించారు. మృతులు రాందేవ్, అరుణ, విజయతోపాటు చిన్నారిగా గుర్తించామని అన్నారు. నంబూరులో ఓ ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేశ్

ఈ ప్రమాద ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

బొల్లారం చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు..

డబ్బు కోసం సెక్యూరిటీ గార్డే..



హైదరాబాద్, అక్టోబర్ 12: భాగ్యనగరం బొల్లారం పరిధిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. గేటెడ్ కమ్యూనిటీలో పనిచేసే ఓ సెక్యూరిటీ గార్డే ఈ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియా సమావేశంలో వెల్లడించారు. 'బొల్లారం పరిధిలోని సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాండెజ్ మోసెస్ ఐదేళ్ల కుమార్తె ఆరేలియా.. అక్టోబర్ 10న సాయంత్రం వేళ కిడ్నాప్‌కు గురైంది. అదే రోజు రాత్రి 7:45 గంటల సమయంలో రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ కిడ్నాపర్.. చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. ఈ మేరకు చి న్నారి తల్లిదండ్రుల ఫిర్యా దు ఆధారంగా.. మల్కాజ్‌గిరి, ఎస్ఓటి, క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్‌లతో కూడిన పది ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. అయినా ఫలితం లేకపోయింది. సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేశాం. 4 గంటల్లో 130 సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాం. ఎక్కడా చిన్నారి ఆచూకీ కనిపించకపోవడంతో.. గేటెడ్ కమ్యూనిటీ అంతా గాలించగా సెల్లార్‌లోని నీటితొట్టెలో చిన్నారి మృతదేహం కనిపించింది. ఈ మేరకు అనుమానం వచ్చి సెక్యూరిటీ గార్డులను విచారణ చేయగా.. అసలు నిజం బయటపడింది.కమ్యూనిటీలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న విక్రమ్ కుమార్ డబ్బు కోసం పాపను కిడ్నాప్ చేసినట్లు అంగీ కరించాడు. అయితే.. చిన్నారి తల్లి దండ్రులు రూ.25 లక్షలు ఇచ్చేంత వరకు చిన్నారిని తన వద్ద అట్టి పెట్టుకోవడం కష్టమని భావించి.. చిన్నారి కాళ్లుచేతులు కట్టేసి సెల్లార్ లోని నీటితొట్టెలో పడేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకు న్నాడు. ఈ మేరకు నిందితుడికి శిక్ష విధించేలా విచారణ కొనసాగి స్తున్నాం' అని సీపీ సుమతి చెప్పారు.ఈ సందర్భంగా సీపీ మా ట్లాడుతూ.. గేటెడ్ కమ్యూనిటీల్లో సెక్యూరిటీ సిబ్బంది నేపథ్యాన్ని తప్పనిసరిగా ధ్రువీక రించుకోవాలని సూచిం చారు. సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్, పని మనుషుల వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

రైతులు అల్లాడుతుంటే సీఎం ఢిల్లీ పర్యటనలా?

పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు హెచ్చరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, వీడియో కాన్ఫరెన్స్‌ను సైతం సక్రమంగా నిర్వహించలేకపోతున్నదని విమర్శించారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. రైతు వేదికల్లో నిర్వహించాల్సిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌పై పలుమార్లు సందేశాలు పంపి, ఆ తర్వాత వాయిదా వేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు.

రైతులపై కేసులు.. బీర్లకు నీళ్లెందుకు?

జూరాల నుంచి నీటిని తీసుకున్నారనే కారణంతో రైతులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసిన ప్రభుత్వం, బీర్ల ఉత్పత్తికి నీటిని అందిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల పంటలకు నీళ్లు అందించలేని ప్రభుత్వం ఇతర అవసరాలకు నీటిని ఎలా కేటాయిస్తుందని నిలదీశారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందించి వారి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

సాగు చేయొద్దంటే రైతులెలా బతకాలి?

రైతులు పంటలు వేయొద్దంటూ వార్తలు వచ్చేలా లీకులు ఇస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులు సాగు చేయకపోతే వారి కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. గతంలో వలస వెళ్లిన కూలీలు తిరిగి సొంతూళ్లకు వచ్చారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లీ వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. రైతులకు భద్రత, భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

విద్యుత్ కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

రాష్ట్రంలో బొగ్గు కొరత, విద్యుత్ కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావానికి బొగ్గు కొరతకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నైనీ బొగ్గును ముందుగానే తీసుకొచ్చి నిల్వలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందని నిలదీశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాలమూరుకు నీళ్లివ్వడంలో వైఫల్యం

పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణలో నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లు నడపలేని పరిస్థితి నెలకొందని అన్నారు. మరోవైపు కృష్ణా జలాలను కుప్పానికి తరలిస్తున్నారంటూ ప్రభుత్వ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలమూరు ప్రజలకు నీళ్లు అందించలేకపోతున్న రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

గత ప్రభుత్వ హయాంలో ట్రయల్ రన్ నిర్వహించిన ప్రాజెక్టుల రిజర్వాయర్లను ఇప్పటికీ ఎందుకు నింపలేకపోతున్నారని ప్రశ్నించారు. కల్వకుర్తిలో ఐదు మోటార్లను 24 గంటలపాటు నడిపితే పాలమూరు ప్రాంతంలోని గణనీయమైన భూములకు సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు.

సింగూరు ప్రాజెక్టుపై నిర్లక్ష్యమెందుకు?

సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు నీటిని అందించే కీలకమైన సింగూరు ప్రాజెక్టు నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యాల వల్ల మాత్రమే ఏర్పడినవి కావని, ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపాలు కూడా కారణమని హరీశ్‌రావు విమర్శించారు. రైతుల సమస్యలపై వెంటనే సమీక్ష నిర్వహించి సాగునీరు, విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని, పంటల సాగుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బ్రేకింగ్.. ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు..!

సోమవారం రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం సిక్కిం, ఒడిశా, కేరళం, కర్నాటక, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను నూతన ప్రథమ పౌరులను ముర్ము ఎంపిక చేశారు. కేరళం గవర్నర్‌గా ఓం ప్రకాశ్ ముథుర్ నియమితులయ్యారు. తమిళనాడుకు రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ వెళ్లనుండగా.. ఒడిశాకు బ్రజ్ మోహన్ రామ్, కర్నాటకకు సుధా యాదవ్, ఉత్తరాఖండ్‌కు ధాల్ సింగ్ బైసెన్, సిక్కింకు దుష్యంత గౌతమ్ గవర్నర్‌లుగా ఎంపికయ్యారు.

రేవంత్ తీరుతో తెలంగాణకు తీవ్ర నష్టం

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు బలం చేకూర్చేలా ఉన్నాయి. ఆయ న ఇన్నాళ్లూ ప్రభుత్వం తీరును తప్పుబట్టినా.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డినే లక్ష్యంగా చేసుకొని అవినీతి ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి.దీంతో అధికార పార్టీలో, రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది. టెండర్లలో భారీగా గోల్‌మాల్ జరుగుతున్నదని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. 'తెలంగాణ ప్రభుత్వానికి డబ్బులు మిగిలించేలా తక్కువ రేట్‌కు టెండర్లు వేస్తే నచ్చదు. ఎక్కువ రేట్‌కు వేసే వాడే కావాలి. వాళ్ల ద్వారా పైసలు సంపాదించుకోవాలి, తెలంగాణ ప్రజల సొమ్మును లూటీ చేయాలి. ఇది చాలా దుర్మార్గం, అన్యాయం కూడా. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనైన నా కంపెనీనే తక్కువ రేటుకు వేస్తే డిస్‌క్వాలిఫై చేస్తారు. ఎక్కువ రేట్‌కు టెండర్లు వేసిన ఆంధ్రా కాంట్రాక్టర్ల కంపెనీలకు కట్టబెడుతారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం అప్పుగా తెచ్చిన సొమ్మును ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం కంటే దుర్మార్గం ఇంకేముంటుంది? మూడేండ్ల నుంచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా ఇట్లనే చేస్తున్నది' అని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి నిధులకు బిల్లులు ఇవ్వమంటే మాత్రం డబ్బులు ఉండవని, ప్రభుత్వం అప్పు తెచ్చిన డబ్బులను రేడియల్ రోడ్ల పేరుతో ఎక్కువ రేట్లకు కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని మండి పడ్డారు. 'ఇది మా కాంగ్రెస్ ప్రభుత్వం. నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేను. అయినా సరే ఇట్లా దుర్మార్గం చేస్తు న్నారు' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. తాము వేసిన టెండర్‌తో ప్రభుత్వానికి రూ.650 కోట్లు మిగిలేవని రాజగోపాల్‌రెడ్డి తేల్చిచెప్పారు. 'బద్వేల్ నుంచి కొడంగల్ వరకు రేడియల్ రోడ్డులో మూడు ప్యాకేజీలకు కలిపి మా కొడుకు నిర్వహిస్తున సుశీ హైటెక్ సంస్థ ద్వారా రూ.650 కోట్ల తక్కువకు టెండర్ వేశాం. మాది ఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న కంపెనీ. మేము వేసిన టెండర్‌లో చిన్న కౌంటర్ సైన్ లేదని రాత్రికి రాత్రి డిస్ క్వాలిఫై చేశారు. కేంద్రంలో కౌంటర్ సైన్ సిస్టమ్ ఉండదు. అయినా సరే మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ విభాగంలోని రీజినల్ ఆఫీసు నుంచే ఎస్ ఈ తరఫున కౌంటర్ సైన్ పత్రం సమర్పించాం. కానీ దాన్ని పట్టించుకోకుండా డిస్‌క్వాలిఫై చేస్తామన్నారు. దానికి కూడా మేము వెంటనే స్పందించి వాళ్లు అడిగిన సర్టిఫికెట్ కూ డా తెచ్చి ఇచ్చాం. అయినా సరే తెల్లారేసరికే మా కంపెనీని కావాలనే డిస్‌క్వాలిఫై చేశారు. ఆంధ్రా కంపెనీలైన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్, బీవీఎస్ఆర్, జీకేసీలకు ఎక్కువ రేటుకు కాంట్రాక్టు అప్పజెప్పారు.దీనివల్ల తెలంగాణ ప్రజల సొమ్ము రూ.650 కోట్లు ఆంధ్రా కంపెనీలకు దోచిపెడుతున్నట్టే. ఇదే టెండర్ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు మా సంస్థకు దక్కి ఉంటే రాష్ట్రానికి రూ.650 కోట్లు మిగిలేవి' అని వివరించారు. తమ కంపెనీ తొమ్మిది రాష్ట్రాల్లో కాంట్రాక్టులు చేస్తున్నదని చెప్పారు. దేశంలోనే ఎవరూ చేయని విధంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో 252 కిలోమీటర్ల రోడ్డు పనులను పూర్తిచేశామని పేర్కొన్నారు. చైనా సరిహద్దుల్లో, పర్వతాల మధ్య మన దేశ సైన్యం కోసం ఈ రోడ్డు నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తిచేశామని, పేరున్న కంపెనీలు కూడా వాటిని చేయలేకపోయాయని చెప్పారు. ఇలా తమ కంపెనీకి ఉన్న అనుభవం దేశంలో మరెవరికీ లేదని స్పష్టంచేశారు. 'మా కంపెనీ బద్వేల్ నుంచి కొడంగల్ రేడియల్ రోడ్డు వర్క్‌ను కండ్లు మూసుకుని చేయగలదు. మేము 20శాతం లెస్‌కు టెండర్ కోట్ చేశాం. కానీ మాకివ్వకుండా ప్రజల సొమ్ము ను, రాష్ట్రం కోసం అప్పు తెచ్చిన డబ్బును ఇట్లా ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం చాలా తప్పు. ఇది చాలా దుర్మార్గం' అని దుయ్యబట్టారు.

సరిహద్దు రేఖ వద్ద పేలిన ఐఈడీ..

నివారించేందుకు ఏర్పాటు చేసిన మైన్స్.. ఉగ్ర కుట్రకు చరమగీతం పాడాయి.సరిహద్దు రేఖ వెంబడి అక్రమంగా భారత్‌లో ప్రవేశించి ఉగ్రదాడులకు పాల్పడాలనుకున్న లష్కరే తొయిబాకు చెందిన ఒక బృందం కథ ముగిసింది. జమ్ముకశ్మీర్‌లో ఎల్ఓసీ గుండా చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నించిన నలుగురు ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజిక్ డివైజ్ పేలుడులో హతమయ్యారు. వీరిలో లష్కరే ప్రధాన నాయకుల్లో ఒకడైన మొహమ్మద్ ఫైజాన్ ఉన్నాడు. జమ్ముకశ్మీర్ పూంచ్ జిల్లా.. ఎల్ఓసీకి సమీపంలోని నంగి టెక్రీకి దగ్గర్లోని కృష్ణ ఘాటి సెక్టార్ గుండా నలుగురు సభ్యులతో కూడిన లష్కరే ముఠా భారత్‌లోకి చొరబడాలనుకుంది.

దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు

గణేశ్ బిగాల, షకీల్ అమీర్, సురేందర్ జాజాల, బీఆర్ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, ఈటీసీఏ వ్యవస్థాపకుడు కిరణ్‌కు మార్, అధ్యక్షుడు జగదీశ్‌రావు కూడా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ దుబాయ్ పాలక కుటుంబసభ్యుల ముఖచిత్రాలను మగ్గంపై నేసిన శాలువా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుబాయ్‌లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఈ శాలువాను ఆవిష్కరించారు. ఈ శాలువాను త్వరలో దుబాయ్ పాలక కుటుంబానికి అధికారికంగా బహూకరించేందుకు ఈటీసీఏ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రయాణికుల రద్దీకి అదనపు బస్సులు

అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లో ఉంటుందని స్పష్టంచేశారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఎఎఽస్ర్తంతీఎఒబం.అఅ వెబ్‌సైట్‌ను, ఇతర వివరాల కోసం ఆర్టీసీ కాల్‌సెంటర్ 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

'ఫసల్ బీమా అమలు చేయాల్సిందే'..

రేవంత్ సర్కార్‌కు రాంచందర్ హెచ్చరిక



హైదరాబాద్, అక్టోబర్ 12: 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు చూశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు ప్రయో జనం చేకూర్చారని తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడి యాతో మాట్లాడుతూ.. రోడ్లు, రైల్వే, ఎయిర్ వేస్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. 41 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నా అని.. ఓట్ డిలీట్ అయిన వాళ్లలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాల యానికి తీసుకురావాలన్నారు.ఒసామా బిన్ లాడెన్ వార సులు కాంగ్రెస్ పార్టీ నేతలు అంటూ రాంచందర్ రావు విరుచుకుపడ్డారు. దేవుళ్లను ఎగతాళి చేయొద్దని.. హిందు వులు ఆగ్రహంతో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రైతులు చనిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లారని మండిప డ్డారు. రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనులకు పోతారా అంటూ ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజలు, రైతుల మీద ఉన్న ప్రేమ ఇదేనా రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని, ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన అమలు చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.కాక్రోచ్.. పిక్రోచ్ కలిసి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశ్నించారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వమ న్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు రాహుల్‌ను అడ్డుకుంటామని తెలిపారు. గోవాలో కాదు తెలంగాణలో డ్రగ్స్ పెరిగిపోతోందని.. నషా ముక్త్ భారత్ అనేది తెలం గాణ నుంచే ప్రారంభం కావాలని చెప్పుకొచ్చారు. జ్ఞానేష్ కుమార్‌తో బీజేపీకి ఏం సంబంధమని నిలదీశారు. నిరసన కారులపై ఎలాంటి దాడులు జరగలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్.. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రా ల్లో కూడా కాంగ్రెస్ ఎక్కడా గెలవదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని కొత్తగా లాంచ్ చేయాలని చూస్తున్నారు కానీ ల్యాండ్ కావడం లేదంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ రద్దు చేసి మరీ.. స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం ఏముందని సీఎం సహా మంత్రులపై రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేవంత్ కుటుంబానిదే విద్యా వ్యాపారం

- గతంలో విద్యను వ్యాపారం చేయొద్దని సీఎం ఉపన్యాసాలు
- ఇప్పుడు కూతురుతోనే కార్పొరేట్ స్కూల్ నిర్మాణం
- బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్



హైదరాబాద్, అక్టోబర్ 12: విద్యను వ్యాపారం చేయొద్దంటూ ఆదర్శాలు వల్లించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు తన కుమార్తె కార్పొరేట్ సూ ల్‌ను ఎందుకు నిర్మిస్తున్నారో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్ర సంపద పెరుగలేదని, రేవంత్‌రెడ్డి కుటుంబ సంపద మాత్రమే పెరిగిందని విమర్శించారు. సోమవారం ఆయన కొంపల్లిలోని మైండ్‌వాల్డ్ కార్పొరేట్ స్కూల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఈ స్కూల్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తు న్నారని ఆరోపించారు. రూ.50 వేల కోట్ల అవినీతి, అక్రమ సంపాదనలో భాగంగానే మైండ్‌వాల్డ్ సూల్‌లో పెట్టుబడులు పెట్టారని దుయ్యబట్టారు. కొంపల్లిలో ఉన్న ఈ సూల్‌ను హైదరాబాద్‌లోని కొల్లూరుతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించేం దుకు ప్రయత్నిస్తున్నారని, ఒక్కో విద్యార్థి నుంచి రూ.2.5 లక్షల ఫీజు వసూలు చేస్తూ వారిపై భారం మోపాలని చూస్తున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలోని సంస్థ రిజిస్టర్డ్ చిరునామాలో నైమిషారెడ్డి, దుంప శిరీష, దుంప బ్రహ్మానందరెడ్డి, బేతి విజయ శ్రీ, శిరీష పరంకుశం పేర్లు ఉన్నాయని పేర్కొ న్నారు. సూల్లో పెట్టుబడుల మూలాలు, భూమి కొనుగోలు వివరాలు, సంబంధిత సంస్థల ఆర్థిక లావాదేవీలపై పారదర్శకత పాటించి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాలలను పూర్తిగా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.తమ్ముడు కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల భూమి అప్పగించడం, మరో తమ్ముడు జగదీశ్వర్‌రెడ్డి బోగస్ కంపెనీతో రూ.వెయ్యికోట్ల ఒప్పందం చేసుకోవడం, కొరియా పర్యటనకు వెళ్లి మరీ సతీమణి పేరుతో గీత హ్యుందాయ్ ఐదు షోరూంలు తెరిపించడం, ప్రభుత్వ దవాఖానలను పట్టించుకోకుండా అల్లుడి మ్యాక్స్ బీఎన్ ఫార్మా, మెడికవర్ దవాఖానను ప్రోత్సహించడం, ఇప్పుడు కూతురు కార్పొరేట్ సూల్ నిర్మించడం ఇవన్నీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన రెండున్నరేండ్లలోనే ఎలా సాధ్యమయ్యా యని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆస్తులు రూ.50 వేల కోట్లకు పెరుగడంపై కాంగ్రెస్ నాయ కులు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు.

ఆశలు కూల్చిన 'ఇందిరమ్మ'!



- ఇల్లిస్తామనడంతో ఇల్లు కూల్చివేత
- కూతురి కిరాయి ఇంటికి తల్లి
- ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూసి తుదకు కన్నుమూసిన పేదరాలు
- ఇంటి ముందు మృతదేహాన్ని అనుమతించిన యాజమాని
- చేసేదేమీ లేక కూల్చిన స్థలంలోనే ఉంచి అంతిమ సంస్కారాలు
- ఖాళీ స్థలంలో నివాసం ఉండేదెలా అంటూ కూతుళ్ల ఆవేదన

హైదరాబాద్, అక్టోబర్ 12: కాంగ్రెస్ సర్కార్ ఇందిరమ్మ నుంచి ఇల్లు వస్తుందన్న ఆశతో ఆ పేద మహిళ ఉన్న గూడును కూల్చుకున్నది. ఎదురుచూస్తూ తన కూతుళ్లు ఉండే కిరాయి ఇంటిలో ఉండసాగింది. కానీ, విధి మరో రూపంలో ఆ పేదరాలిని వెంటాడింది. ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహాన్ని కిరాయి ఇంటి య జమాని అనుమతించకుండా కాఠిన్యం చూపాడు. కన్నతల్లి మృతదేహాన్ని ఎక్కడ ఉంచాలో తెలియని దుస్థితి. చేసేది లేక చివరకు ఆమె కూల్చుకున్న ఇంటి స్థలమే దిక్కయింది.అక్కడే ఉంచి ఆ తల్లికి ఆమె కూతుళ్లు అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్న ఆశతో మొదలైన ప్రయాణం.. నిలువ నీడ కరువై కన్నతల్లి కడసారి వీడ్కోలు కూడా ఆరుబయటే నిర్వహించాల్సిన విషాదంగా మారింది. ఇది ఓ నిరుపేద కుటుంబానికి ఎదురైన దయనీయ పరిస్థితి. కాంగ్రెస్ సర్కార్ పథకాల అమలులో నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నది. మేడ్చల్-మల్కాజిరిగి జిల్లా శామీర్‌పేట మం డల కేంద్రానికి చెందిన గండమళ్ల లక్ష్మి(84)కి 100 గజాల్లో పెంకుటిల్లు ఉండేది. ఆమె భర్త, కొడుకు గతంలో చనిపోగా, ఇద్దరు కూతుళ్లు రాజమణి, ఆండాలుకు వివాహాలు జరిపించించింది. ఇలాంటి స్థితిలో కూతుళ్లే లక్ష్మి ఆలనాపాలనా చూసుకోసాగారు. శిథిలావస్థకు చేరుకున్న ఆ పెంకుటిల్లు స్థానంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ నాయకులు, అధికారులు హామీ ఇచ్చారు. వారిచ్చిన హామీతో రెండేండ్ల క్రితం ఉన్న ఇంటిని కూల్చివేసింది. అప్పటి నుంచి లక్ష్మి కిరాయి ఇంటిలో ఉంటూ, అధికారులు, కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరిగి విసిగి వేసారింది. కూల్చివేసిన ఇంటిని కూతుళ్ల పేరున మార్చాలని కొందరు నాయకులు సూచించడంతో నమ్మిన ఆ పేదరాలు.. రూ.60 వేలు అప్పు తెచ్చి తన ఇద్దరు కూతుళ్ల పేరున రిజిస్ట్రేషన్ చేయించింది. అయినా ఇల్లు మంజూరు కాలేదు. ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూసిన ఆ పేదరాలు సోమవారం తుదిశ్వాస విడిచింది. అంత్యక్రియలకు కిరాయి ఇంటి యజమానులు కాఠిన్యంతో నిరాకరించారు. దీంతో చేసేదేమీ లేక తమకున్న 100 గజాల ఖాళీ స్థలంలో తమ తల్లి అంత్యక్రియలకు ఆమె కూతుళ్లు, బంధువులు సిద్ధమయ్యారు. టెంట్ కిందే మృతదేహాన్ని ఉంచి కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

జంతర్ మంతర్‌కు నిరసన వేదిక హోదా రద్దు


- మూడు వేరే ప్రత్యామ్నాయ ప్రదేశాల సూచన
- ఢిల్లీ పోలీసుల ఉత్తర్వు.. విపక్షాల ఆగ్రహం



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: జంతర్ మంతర్‌ను నిరసనలు, ప్రదర్శనలకు నిర్దేశిత వేదికగా గుర్తించే హోదాను ఢిల్లీ పోలీసులు సోమవారం రద్దు చేశారు. అటువంటి సమావేశాలు, ప్రదర్శనల కోసం మూడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను వారు సూచించారు. శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి విష యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)తో ప్రతిష్ఠంభన నెలకొనడం, సుప్రీంకోర్టు ఇండియా కూటమి తలపెట్టిన పాదయాత్రకు ముందు రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేసిన నేపథ్యంలో ఢిల్లీ పోలీ సులు ఈ చర్య తీసుకున్నారు.ఈనెల 11న (ఆదివారం) నాటి ఒక స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం కొత్తగా నిర్ణయించిన మూడు వేదికల్లో పాత ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదానం, ఉత్తర ఢిల్లీలోని బురారీ మైదానం ఉన్నాయి. ఈ మూడు ప్రదేశాలు సెంట్రల్ ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి వరుసగా 3 కి.మీ, 13.5 కి.మీ, 44 కి.మీ. దూరంలో ఉన్నాయి. ఢిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్‌కుమార్ సంతకంతో వెలువడిన ఈ ఉత్తర్వు జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా నిర్దేశిస్తూ 2022 ఏప్రిల్ 28న జారీ చేసిన మునుపటి ఉత్తర్వును పాక్షికంగా సవరించింది. ఈ మూడు కొత్త వేదికల వద్ద నిరసనలు, ప్రదర్శనల నిర్వహణకు సంబంధించిన సమగ్రమైన, సవరించిన ప్రామాణిక కార్యకలాపాల విధానాలను (ఎస్ఓపీ) విడిగా జారీ చేస్తామని పోలీసులు తెలిపారు.కాగా, జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి విషయంలో సీజేపీ, ఢిల్లీ పోలీసుల మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన నేపథ్యంలో ఈ ఆదేశం వెలువడింది. నిరసన ప్రదర్శన కోసం ఒక తేదీని కేటాయించాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, అనుమతి నిరాకరణకు గల కారణాలను కోరుతూ సీజేపీ నాయకులు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. శాంతియుతంగా నిరసన తెలపాలన్న తమ ఉద్దేశం గురించి పోలీసులకు అధికారికంగా సమాచారం అందించామని, వారు ఆ సమాచారాన్ని స్వీకరిం చారని సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. అయితే నిరసనకు ఎటువంటి తేదీని ఖరారు చేయలేదని, అలాగే ఆంక్షలకు గల కారణా లపై తమకు ఎలాంటి వివరణ అందలేదన్నారు.

రేపే సింగరేణి కార్మిక గర్జన

- 30 వేల మందిని సభకు సమీకరించేందుకు సన్నాహాలు
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నేతలు



హైదరాబాద్, అక్టోబర్ 12: సింగరేణి బొగ్గు గనుల ప్రాం తంలో కదం తొక్కేందుకు కార్మికలోకం సమాయత్తమ వుతున్నది. నల్ల సూర్యుళ్ల సమస్యలే ఎజెండాగా.. హకులు, హామీల అమలు సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ తలపెట్టిన 'సింగరేణి కార్మిక గర్జన'కు సర్వం సిద్ధమవుతున్నది. గోదావరిఖని సింగరేణి స్టేడియంలో బుధవారం సాయం త్రం నిర్వహించనున్న భారీ బహిరంగసభతో కార్మిక ఉద్య మానికి కొత్త ఊపు తీసుకురావాలని పార్టీ శ్రేణులు పట్టుద లతో పనిచేస్తున్నాయి.బహిరంగసభకు మాజీ మంత్రి కొప్పు ల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల సుమన్, కోరుకంటి చందర్, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తూ, జనసమీకరణకు అవసరమైన చర్యలపై నాయకులు దృష్టి సారించారు. సింగరేణి కార్మికుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగట్టి, కార్మికుల హక్కులు, సంస్థను కాపాడుకునేందుకు ఈ నెల 14న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి స్టేడియం వేదికగా బీఆర్ఎస్ సింగరేణి కార్మిక గర్జన సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.టీబీజీకేఎస్ నేతలు సమావేశాలు, డివిజన్లవారీగా సమీక్షలతో కార్మికులను సమీకరించే పనిలో నిమగ్నమయ్యారు. అన్ని స్థాయిల నాయకులు, కార్య

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

ఢిల్లీ నిరసనలతో బీజేపీ క్యాచ్ 22లో చిక్కుకుందా ?

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ఎస్ఐఆర్ అక్రమాల వ్యవహారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ లో నెలకొన్న విభేదాల్ని ఇండియన్ ఎక్స్ ప్రెస్ బయటపెట్టిన తర్వాత కేంద్రంలో ఎన్డీయేని నడుపుతున్న బీజేపీ ఆత్మరక్షణలో పడిపోయింది. ముఖ్యంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ఏ కపక్షంగా తీసుకున్న నిర్ణయాల వెనుక బీజేపీ ఉందన్న ప్రచారం ఓవైపు కొనసాగుతుండగా.. ఢిల్లీలో జరుగుతున్న నిరసనల్ని ఎలా అడ్డుకోవాలో, ఎదుర్కోవాలో తెలియక అధికారపక్షం సతమతం అవుతోంది. ఈ పరిస్థితినే క్యాచ్ 22 గా గా రాజకీయ నిపుణులు అభివర్ణిస్తున్నారు.ఒక పని చేయాలంటే ముందుగా మరో పని జరగాలి, కానీ ఆ రెండో పని జరగాలంటే మొదటి పని చేయాల్సి ఉంటుంది, ఇలా ఒకదానిపై మరొకటి ఆధారపడి, సమస్య నుంచి బయటపడలేని పరిస్థితిని క్యాచ్ 22గా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తుంటారు. ఉదాహరణకు ఉద్యోగం కోసం ప్రయత్నించే సందర్భంలో.. ఉద్యోగం రావాలంటే అనుభవం ఉండాలి అని కంపెనీ చెబుతుంది. , అనుభవం రావాలంటే ముందుగా ఉద్యోగం రావాలి, ఉద్యోగం లేకపోతే అనుభవం రాదు, అనుభవం లేకపోతే ఉద్యోగం రాదు.ఇదే క్యాచ్ 22 పరిస్థితి. అలాగే మరో ఉదాహరణ చూస్తే ఉద్యోగానికి దరఖాస్తు చేయాలంటే ఒక సర్టిఫికెట్ కావాలి, ఆ సర్టిఫికెట్ పొందాలంటే ఉద్యోగంలో ఉన్నట్లు ఆధారం చూపాలి. ఉద్యోగం లేకుండా సర్టిఫికెట్ రాదు,



సర్టిఫికెట్ లేకుండా ఉద్యోగానికి దరఖాస్తు చేయలేరు. అలాగే ఇంటికి వెళ్లడానికి డబ్బులు కావాలి, ఆ డబ్బులు సంపాదించడానికి పనికి వెళ్లాలి, కానీ పనికి వెళ్లడానికి కూడా డబ్బులు కావాలి. ఇదీ క్యాచ్ 22 పరిస్థితికి మంచి ఉదాహరణ. సులభంగా చెప్పాలంటే: ఏం చేసినా సమస్య నుంచి బయటపడలేని పరిస్థితి.కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాల నుంచి మొదలైన విమర్శల పరంపర.. ఇప్పుడు సీఈసీ జ్ఞానేష్ కుమార్ తో రాజీనామా చేయించడం లేక ఆయనపై పార్లమెంట్ లో అభిశంసన పెట్టి సాగనంపాలన్న డిమాండ్ల వరకూ వచ్చేసింది. దీంతో ఢిల్లీవీధులు విపక్షాలు, విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ శ్రేణులతో నిరసనల హోరెత్తుతోంది. ఇదంతా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మెడకు చుట్టుకుంటోంది. అందుకే బీజేపీ ఇప్పుడు క్యాచ్ 22లో చిక్కుకుందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ఎందుకంటే ఆందోళనలు ఆగాలంటే జ్ఞానేష్ తప్పుకోవాలి లేదా తప్పించాలి. అలా చేస్తే కానీ విపక్షాలు, ప్రజా సంఘాలు శాంతించేలా లేవు. అలాగని జ్ఞానేష్ ను తప్పించడం అంత సులువు కాదు. ఎందుకంటే జ్ఞానేష్ ను తప్పిస్తే వరుసగా రెండోసారి ఢిల్లీలో కేంద్రం ఓటమిని అంగీకరించినట్లు అవుతోంది. అలాగని మౌనంగా ఉన్నా విమర్శలు, నిరసనల హోరు తప్పడం లేదు. దీంతో బీజేపీ ఇప్పుడు క్యాచ్ 22 లాంటి పరిస్థితి ఎదుర్కుంటోందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.గతంలో నీట్ అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో నిరసనలకు పిలుపునిచ్చినప్పుడు వారిని తక్కువగా అంచనా వేసిన కేంద్రం.. ఆ తర్వాత భారీ మూల్యం చెల్లించుకుంది. జంతర్ మంతర్ లో సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష సాయంతో కాక్రోచ్ లు రెచ్చిపోయారు. వాళ్లను కంట్రోల్ చేసే పరిస్థితి లేక కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించేసింది. ఇప్పుడు అదే తరహాలో జ్ఞానేష్ తోనూ అదే విధంగా రాజీనామా చేయించవచ్చు.

కానీ కేంద్రానికి రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ తప్పదు. ఈ ప్రభావం కూడా ఇక్కడితో ఆగదు. వచ్చే ఏడాది చివరి లోపు జరగాల్సిన దాదాపు 10 రాష్ట్రాల ఎన్నికలపై పడుతుంది. అంతటితో కూడా ఇది ఆగదు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలపైనా పడే ఛాన్స్ ఉంది. దీంతో బీజేపీ కర్ర విరగకుండా, పాము చావకుండా ఆచితూచి వ్యవహరిస్తోంది. ఓ దశ దాటిన తర్వాత ఏ ఉద్యమం అయినా రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు నష్టం కలిగించడం ఖాయం. అయితే ఇందులో తక్కువ నష్టంతో బయటపడాలంటే మాత్రం జ్ఞానేష్ తో రాజీనామా చేయించడమే మార్గమని విశ్లేషకులు చెప్తున్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో
తాడ్కోల్ వాసి మృతి?

- **డ్రోన్ దాడిలో చనిపోయినట్లు స్నేహితుడి వాయిస్ మెసేజ్**
- **ఆందోళనలో కుటుంబ సభ్యులు**

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 12: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన వ్యక్తి చనిపోయినట్లు సమాచారం రావడంతో అతడి కుటుంబం ఆందోళన చెందుతున్నది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు ఏజెంట్ మోసం వల్ల రష్యాలో చిక్కుకుపోయారు. అయితే, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అక్కడి ప్రభుత్వం వీరిని బలవంతంగా సైన్యంలో చేర్చుకున్నది.ఈ నలుగురిలో ఒకరైన తాడ్కోల్ వాసి మహమ్మద్ అఫ్జల్‌ఖాన్ (43) మృతి చెందాడనే వార్త స్థానికంగా కలకలం రేపుతున్నది. రష్యాలోని అడవుల్లో చిక్కుకున్న వారిలో ఒకరైన సిర్సు అశోక్ తన భార్యకు పంపిన వాయిస్ మెసేజ్‌తో ఈ విషయం బయటకు వచ్చింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో అఫ్జల్‌ఖాన్ మృతి చెందిపది రోజులవుతున్నదని వాయిస్ మెసేజ్‌లో తెలిపాడు. తమతో కలిపి మొత్తం 50 మంది వస్తే 48 మంది చనిపోయారని, ఇద్దరం మాత్రమే గాయాలతో పారిపోతుండగా, సైనికులు పట్టుకుని బేడీలు వేసి కట్టేశారని పేర్కొన్నాడు.మరోవైపు, అఫ్జల్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అసలు అతడు మృతి చెందాడా.. లేదా? అనే విషయాన్ని ధ్రువీకరించుకునేందుకు తండ్రి అబ్బాస్‌ఖాన్, భార్య అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. జిల్లా ఎస్పీకి, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లామని, ఎలాంటి సమాచారం అందడం లేదని అబ్బాస్‌ఖాన్ వాపోయారు.


శాంతియుత నిరసనకారులను నిర్బంధించొద్దు

- **మెట్రో, రైలు సేవలు యథావిధిగా నడపాలి**
- **ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించొద్దు**
- **ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలి**
- **ప్రజాశాంతిని కాపాడే పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను పూర్తిగా నిరోధించలేం**
- **ఢిల్లీ నిరసనలపై సుప్రీం కోర్టు మధ్యంతర ఆదేశాలు**



న్యూఢిల్లీ, అక్టోబర్ 12:
ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని, మెట్రో రైలు, రైల్వే సేవలను సాధారణంగా కొనసాగించాలని, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించరాదని ఆదేశించింది. ప్రజాశాంతికి భంగం కలిగే పరిస్థితులు తలెత్తిన పుడు చట్ట ప్రకారం అవసరమైన పరిమితులు విధించవచ్చని పేర్కొంది. ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మొహనాలతో కూడిన ధర్మాసనం ఈ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు పరిసరాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 అమలులో ఉందని తెలిపే బోర్డును తొలగించాలని, ఇప్పటికే తొలగించకపోతే వెంటనే తొలగించాలని అధి కారులను ఆదేశించింది. న్యాయస్థానాలకు చేరుకోవడంలో ప్రజలకు ఎలాంటి భయాందోళనలు ఉండకూడదని స్పష్టం చేసింది. అక్టోబర్ 10న ఢిల్లీలో జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా నిర్బంధాలకు పాల్పడ్డారని, నిరసనకారులపై అధిక బలప్రయోగం చేశారని పేర్కొంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రజారవాణా సేవలకు ఆంక్షలు విధించడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివే యడం, రాజకీయ నాయకులు, విద్యార్థులు, న్యాయవాదులు, జర్నలిస్టులను నిర్బంధించడం వంటి అంశాలు కూడా విచారణకు వచ్చాయి. ఆర్‌జెడి రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సెక్షన్ 163 అమలులో ఉన్న ప్రాంతానికి నాలుగు కిలోమీటర్ల పరిధి వెలుపల ఉన్నవారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రైళ్లలో ప్రయాణిస్తున్నవారిని సైతం పోలీసులు ఎత్తుకెళ్తున్నా ంని, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగిం చారని, శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ 45 మెట్రో స్టేషన్లు మూసివే శారని తెలిపారు. సీనియర్ న్యాయవాది షదన్ ఫరాసత్ కూడా నిరసన సందర్భంగా తాను పోలీసుల దాడికి గురయ్యానని కోర్టుకు తెలి పారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును రాజధానిలో దెబ్బతీశారని, పౌరుల శాంతియుత నిరసన హక్కును పునరుద్ధ రించాలని కోరారు.ఢిల్లీలో ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న బారికేడ్లను వెంటనే సమీక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ నిబంధనలకు లోబడి నగరంలో ప్రజలు స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతించాలని పేర్కొంది. అక్టోబర్ 9న కూడా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రాకపోకలపై ఆంక్షలకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, రైల్వే సేవలను పూర్తిగా నిలిపివేయకుండా అవసరాన్ని బట్టి నియంత్రించాలని తెలిపింది.న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా ఎవరూ అడ్డుకోరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.”

నేను చెప్పాను కాబట్టే ఒప్పుకున్నారు!
పిచ్చి యుద్ధాన్ని ఆపాలి



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: రష్యా-ఉక్రెయిన్ మధ్య ఎడతెగకుండా సాగుతున్న సుదీర్ఘ పోరుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలనే ఆరాటం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లోనే ఎక్కువగా కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి రష్యా దాడులు చేస్తోందంటూ కేవ్ ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. మిడ్‌టర్మ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓహియో వెళ్లేందుకు సిద్ధమైన ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ యుద్ధంలో నెలకు ఏకంగా 32,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది అత్యంత విచారకరమైన, అనవసరమైన “పిచ్చి యుద్ధం” అని అభివర్ణించారు. ఇరుదేశాల అధినేతలు వెంటనే ఒకచోట కూర్చుని ఈ ఘర్షణకు చరమగీతం పాడాలని తేల్చిచెప్పారు. ఇరువైపులా ఉల్లంఘనలు జరుగుతున్నట్లు కథనాలు వస్తున్నాయని, వాటిపై తాను పూర్తి వివరాలు తెలుసుకుంటానని ట్రంప్ పేర్కొన్నారు. కాల్పుల విరమణకు ఇరుదేశాలు అధికారికంగా స్పందించలేదన్న విలేకరుల ప్రశ్నకు ట్రంప్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. “వాళ్లు ఒప్పందానికి అంగీకరించారు.. ఎందుకో తెలుసా? నేను ఒప్పందానికి రమ్మని చెప్పాను కాబట్టి!” అని వ్యాఖ్యానించారు. ఇద్దరు నేతలకు శాంతి ఒప్పందం చేసుకోవాలనే ఉంది కానీ, అది ఎలా చేయాలో అర్థం కావడం లేదని, తానే వారిద్దరినీ ఒకే వేదికపైకి తెచ్చి ఒప్పందం కుదిరేలా చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. రష్యా నుంచి డీజిల్ సరఫరాలను అనుమతించడంపై సొంత పార్టీ రిపబ్లికన్ల నుంచి వ్యక్తమవుతున్న విమర్శలను ట్రంప్ తోసిపుచ్చారు. ప్రపంచ ఇంధన మార్కెట్లో స్థిరత్వం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రష్యా నుంచి లక్షలాది టన్నుల డీజిల్ సరఫరా కానుందని, దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌కు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అమెరికాలోని రైతులు, పశుపోషకులకు ప్రయోజనం చేకూరే ప్రతి నిర్ణయానికి తాను మద్దతు ఇస్తానని పేర్కొంటూ, జెలెన్స్కీ అనవసర విమర్శలు మాని శాంతి చర్చలపై దృష్టి పెట్టాలని సూచించారు. మరోవైపు అమెరికా అధినేత వ్యాఖ్యలపై ఉక్రెయిన్ తీవ్రంగా స్పందించింది. అమెరికా ప్రతిపాదించిన ఇంధన కాల్పుల విరమణకు కట్టుబడి తాము రష్యా ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేస్తే, రష్యా మాత్రం నివాస ప్రాంతాలపై డ్రోన్ దాడులకు తెగబడిందని జెలెన్స్కీ ఆరోపించారు. కీవ్‌లోని ఒక బహుళ అంతస్తుల భవనంపై రష్యా డ్రోన్ దాడి చేయడంతో ఇద్దరు పౌరులు మరణించారని, తొమ్మిది మంది గాయపడ్డారని వెల్లడించారు. ట్రంప్ శాంతి ప్రతిపాదనలకు పుతిన్ ఇస్తున్న సమాధానం ఇదేనని, రష్యా దౌర్జన్యాలకు స్వస్తి పలకాలంటే అంతర్జాతీయ సమాజం మరింత గట్టి ఒత్తిడి తీసుకురావాలని జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు.

దేశంలోకి చొరబాటుకు యత్నం..

నలుగురు పాకిస్థానీ టెర్రరిస్టులు హతం..

